## వరికపూడిశెల ఎత్తిపోతల పథకం
# పనులను వేగవంతం చేయాలి



2 లో


# మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
శుక్రవారం | 11 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 10


# భక్తులకు... భద్రత



పి.మీరాహుస్సేన్ ఖాన్



- ఆధ్యాత్మికంగా నవరాత్రులుండాలి
- మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ తప్పనిసరి
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- పలు ప్రాంతాలను పరిశీలించిన అధికారుల బృందం
- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

2 లో

వినాయక చవితి సందర్భంగా నగరంలోని ప్రతి వినాయక మండపం వద్ద భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించి, నగరంలోని వినాయక మండపాల వద్ద భక్తుల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, విద్యుత్ భద్రత, మండపాల స్థిరత్వం తదితర అంశాలపై సమీక్షించారు.



-విజయవాడ, మనంబ్యూరో

వేమూరు శాసనసభ్యులు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు జన్మదిన సందర్భంగా ఆయనకు కత్తెర దంపతులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, హార్వెస్ట్ ఇండియా అధినేత తెలుగుదేశం రాష్ట్ర నాయకులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, కలిసి బొకేలు అందించి భారీ గజమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుదేశం నాయకుడు సుద్ధపల్లి నాగరాజు, ఎస్ ఎస్ ఆర్ టీం పాల్గొన్నారు

-గుంటూరు ,మనం న్యూస్ ప్రతినిధి



# మట్టి గణపతే... శ్రేష్ఠం

- నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరగాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మట్టిగణపతులే వాడేలా చూడాలి
- జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

8 లో



## ఆర్థిక సమ్మిళితతను పటిష్టపరిచేలా
# జీఎఫ్ఎఫ్ 2026లో డీఎఫ్ఎఫ్ ఆవిష్కరణలు

**విజయవాడ,సెప్టెంబర్,10,(మనం న్యూస్):** భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం ( డీఎఫ్ఎఫ్ ) కార్యదర్శి సంజయ్ లోహియా, దేశంలో ఆర్థిక సమ్మిళితతను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్ ) 2026లో ఈరోజు పలు నూతన ఆవిష్కరణలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తక్షణమే రూపే కార్డులు మరియు వ్యాపారుల యూపీఐ క్యూఆర్ కోడ్లను జారీ చేసేందుకు ఓపెన్ సోర్స్ (ఆండ్రాయిడ్) ఏటీఎంలను ప్రవేశపెట్టడం, ప్రభుత్వం మద్దతు ఇచ్చే ఎంపిక చేసిన రుణ పథకాల కోసం క్రెడిట్ లైన్ ఆన్ యూపిఐ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం, అలాగే ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) త్రీ పార్టీ నగదు డిపాజిట్ సదుపాయాన్ని ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి సౌరభ్ విజయ్ సమక్షంలో ఈ ప్రకటన జరిగింది. రూపే కార్డు, వ్యాపారి క్యూఆర్ కోడ్ జారీ కోసం ఓపెన్ సోర్స్ (ఆండ్రాయిడ్) ఏటీఎం ఈ పరిష్కారం ద్వారా వినియోగదారులు సులభమైన స్వయం సేవా విధానం ద్వారా ఏటీఎం నుంచే వ్యక్తిగతీకరించిన రూపే డెబిట్, క్రెడిట్ మరియు ఎన్సీఎంఎస్ కార్డులను తక్షణమే పొందగలుగుతారు. ఓపెన్ సోర్స్ (ఆండ్రాయిడ్) ఏటీఎంలు యూపీఐ ఆధారిత చెల్లింపుల స్వీకరణ కోసం వ్యాపారుల క్యూఆర్ కోడ్లను కూడా జారీ చేస్తాయి. దీని ద్వారా వ్యాపారులు సులభంగా క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేసుకుని, చెల్లింపులను స్వీకరించడం ప్రారంభించవచ్చు. అదనంగా, ఈ ఏటీఎం ల ద్వారా చెక్కుల డిపాజిట్, ఖాతా ప్రారంభం మరియు రుణ దరఖాస్తు వంటి బ్యాంకింగ్ సేవలను కూడా పొందవచ్చు.జీఎఫ్ఎఫ్ అతిథులు మరియు హాజరైన వారు, జీఎఫ్ఎఫ్ వేదిక అంతటా ఏర్పాటు చేసిన ఓపెన్ సోర్స్ ఏటీఎం లను ప్రత్యక్షంగా ఉపయోగించి వాటి సేవలను అనుభవించే అవకాశం పొందారు. ఈ పరిష్కారం ఏటీఎం ల పాత్రను కేవలం నగదు ఉపసంహరణ మరియు డిపాజిట్ యంత్రాలకే పరిమితం కాకుండా, తెలివైన కస్టమర్ సేవలు మరియు బ్యాంకింగ్ సేవలకు అందుబాటు కేంద్రాలుగా విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకుంది.



# భక్తులకు...భద్రత

**ఆధ్యాత్మికంగా నవరాత్రులుండాలి**
**మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ తప్పనిసరి**
**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**
**పలు ప్రాంతాలను పరిశీలించిన అధికారుల బృందం**
**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**(విజయవాడ,మనం బ్యూరో):** వినాయక చవితి సందర్భంగా నగరంలోని ప్రతి వినాయక మండపం వద్ద భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించి, నగరంలోని వినాయక మండపాల వద్ద భక్తుల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, విద్యుత్ భద్రత, మండపాల స్థిరత్వం తదితర అంశాలపై సమీక్షించారు.ప్రతి వినాయక మండపం వద్ద 200 లీటర్ల నీటి డ్రమ్ముతో పాటు ఇసుక, సిఓ, డ్రై కెమికల్ పౌడర్ ఫైర్ ఎక్స్టింగ్విషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే లైటింగ్, డెకరేషన్, విద్యుత్ కనెక్షన్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వైర్లు లూజుగా వేలాడకుండా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.పట్టణ ప్రణాళిక అధికారులు మండపాల స్టేజ్ల స్థిరత్వాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం అధికారులు సూచించే భద్రతా చర్యలకు నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. అలాగే పూజ అనంతరం వెలువడే పూల వ్యర్థాలు, ఇతర పూజా సామగ్రి కోసం మండపాల వద్ద ప్రత్యేకంగా డస్ట్బిన్లు ఏర్పాటు చేసి, వ్యర్థాలను తడి, పొడి మరియు పూల వ్యర్థాలుగా వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పూల వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా అగరబత్తీలు, ధూప్స్టిక్స్ తదితర ఉత్పత్తుల తయారీకి వినియోగించేలా నగర పాలక సంస్థకు అందించాలని కమిషనర్ తెలిపారు. వినాయక మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావును నోడల్ అధికారిగా నియమించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, రత్నబాబు, ఎస్ఎఫ్ఓ నరేష్ పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్లలో విస్తృత తనిఖీలు

**బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించని 8 సంస్థలకు నోటీసులు**

**విజయవాడ,సెప్టెంబర్, 10,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ నిర్మల గ్లోరీ సూచనల మేరకు, 40వ డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ, సిబ్బందితో కలిసి గురువారం డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా భవానిపురం, క్రాంబే రోడ్ ప్రాంతాలలో గల ఆసుపత్రులు, క్లినిక్లలో బయో మెడికల్ వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, నిల్వ చేయడం, తరలింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు పాటించని కేబి డయాగ్నసిస్ సెంటర్, తులసి క్లినిక్, సాయి నర్సింగ్ హోమ్, ఆల్మట్టి నర్సింగ్ హోమ్, భవాని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆర్కే డయాగ్నస్టిక్ సెంటర్, భయపరెడ్డి క్లినిక్, ఎమిన్ ఆసుపత్రులకు బయో మెడికల్ వేస్ట్ రూల్స్, 1998 మరియు యస్.ఓ. నెం. 630(ఈ) ప్రకారం నోటీసులు జారీ చేశారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఆసుపత్రి, క్లినిక్ బయో మెడికల్ వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే ప్రదేశంలోనే తప్పనిసరిగా వేరు చేయాలని అధికారులు సూచించారు. నిబంధనల ప్రకారం పసుపు, ఎరుపు, తెలుపు, నీలం రంగుల కేటగిరీలకు అనుగుణంగా వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి, వాటిని అధీకృత (సిబిడబ్ల్యూటిఎఫ్) ద్వారా మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణకు తరలించాలని స్పష్టం చేశారు. బయో మెడికల్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్ల ప్రజారోగ్యానికి, పారిశుద్ధ్యానికి, పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉన్నందున, సంబంధిత నిబంధనలను ప్రతి ఆసుపత్రి, క్లినిక్ తప్పనిసరిగా పాటించాలని అధికారులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని ఆసుపత్రులు, క్లినిక్లలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సర్కిల్-1 శానిటరీ సూపర్వైజర్ ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రజారోగ్యం సిబ్బంది పాల్గొన్నారు.



# వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలి

**జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



పల్నాడు సెప్టెంబర్ :10 (మనం న్యూస్ ప్రతినిధి)పల్నాడు జిల్లాలోని ప్రతిష్టాత్మక వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పురోగతి పై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం సచివాలయం లోని తన పేషీలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు , మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి,సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పనుల కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.63.14 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పరిధిలో చేపట్టనున్న పైప్లైన్ నెట్వర్క్ పనులను వేగవంతం చేయడంలో భాగంగా భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ తదుపరి నోటిఫికేషన్ విడుదల చేసి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్ల నున్నారు. డిసెంబర్ చివరి నాటికి భూసేకరణ పూర్తిచేయాలని నిర్దేశించారు. అదే సమయంలో పబ్లిక్ హియరింగ్,84,500 ఎకరాలకు సంబంధించి డీపీఆర్ను అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అదేవిధంగా,పర్యావరణ అనుమతుల (ఈ. సి.) కోసం అవసరమైన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి పల్నాడు జిల్లాలోని రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందించే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి రామానాయుడు, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు.

# నగరంలోని 52 పాఠశాలల్లోని 25 వేల మంది విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాలు తయారీ నగర కమిషనర్



గుంటూరు నగర పాలక సంస్థ సెప్టెంబర్ :10 (మనం న్యూస్ ప్రతినిధి )గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న చేపట్టనున్న గ్రీన్ గణేష్ మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని వరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు నమోదు చేయనున్నదని, రికార్డ్ నమోదు విజయవంతం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం గ్రీన్ గణేష్ కార్యక్రమంలో భాగంగా ఏకకాలంలో 25 వేలమంది విద్యార్థులతో మట్టి గణేష్ విగ్రహాల తయారీ కార్యక్రమ ఏర్పాట్లను నగర పాలక సంస్థ యన్టిఆర్ స్టేడియంలో సెంట్రలైజ్ గా ఏర్పాటు చేస్తున్నసభాప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన పెంచడంతో పాటు వరల్ బుక్ రికార్డ్స్ లో గుంటూరు పేరు నిలిచేలా గ్రీన్ గణేష్ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగరంలోని 52 పాఠశాలల్లోని 25 వేల మంది విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాలు తయారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సదరు కార్యక్రమాన్ని సెంట్రలైజ్ గా ఎన్టిఆర్ స్టేడియంలో పర్యవేక్షిస్తామన్నారు.ఇప్పటికే విగ్రహాల తయారీకి అవసరమైన విత్తనాలు కలిపిన మట్టి, విద్యార్థులకు రిస్ట్ బ్యాండులు, ప్రశంసా పత్రాలను అన్ని పాఠశాలలకు అందజేయుట జరిగిందన్నారు. కార్యక్రమం జరిగే ప్రతి పాఠశాలకు విధులకు కేటాయించబడిన సిబ్బంది, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో కార్యక్రమం జరిగేలా సమన్వయం చేసుకోవాలన్నారు.స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, అవసరమైనా సదుపాయాలను కల్పించాలన్నారు .కార్యక్రమ నిర్వహణ సామగ్రి అన్ని పాఠశాలలకు అందటం, విద్యార్థులు భాగస్వాములు అవటం పై ఎంఈఓ లు, పాఠశాలల యాజమాన్యాలతో మరియు నగర పాలక సంస్థ అధికారులతో సమన్వయంతో చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, ఎంటిఆర్ స్టేడియం సెక్రటరీ వజ్జ రామక్రిష్ణ,డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి,సిటి ప్లానర్ రాంబాబు,ఉపా సెల్ పిఓ సింహచలం,ఎంఈఓలు ఖుద్దూస్, నాగేంద్రం, జ్యోతి కిరణ్ పాల్గొన్నారు.

# గుంటూరులో చిన్నబత్తిని భాగ్యయ్య పీఠాధిపతుల దశమ పీఠాధిపత్య వేడుకలు

గుంటూరు సెప్టెంబర్ :10 (మనం ప్రతినిధి)ఫ గుంటూరులోని డాన్ బాస్కో ప్రాంగణంలో మహాఘన శ్రీశ్రీశ్రీ డాక్టర్ చిన్నబత్తిని భాగ్యయ్య పీఠాధిపతుల దశమ పీఠాధిపత్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ. తమ ఆధ్వర్యంలోని 107 విచారణల కార్యకలాపాలకు ఇప్పటివరకు తానే



బాధ్యత వహిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు ఆర్థిక అభివృద్ధి, పిల్లలకు విద్యా సదుపాయాల కల్పన, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ దశమ పీఠాధిపత్య వేడుకలకు మహోన్నత కార్డినల్,పీఠాధిపతులు, పూజ్య గురువులు , బ్రదర్స్, కన్యాశ్రీలుతో పాటు సుమారు 5 వేల నుంచి 10 వేల మంది భక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు.

# దళితులను విస్మరిస్తే పుట్టగతులుండవు

- **ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ నాయకుల హెచ్చరిక**
- **ఏడు ప్రధాన అంశాలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్**
- **విజయవాడ ధర్నా చౌక్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత మహా గర్జన**

విజయవాడ ధర్నా చౌక్,సెప్టెంబర్,10,(మనం న్యూస్) : దళితులు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి పుట్టగతులుండవని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. ఏడు ప్రధాన అంశాలపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దళిత మహా గర్జన' కార్యక్రమం జరిగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి షాలేమ్రాజు మాదిగ సభాధ్యక్షత వహించిన ఈ మహాసభకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. అమరావతి రాజధానిలో దళిత గిరిజనుల స్థానం ఎక్కడ, రక్షణకు తీసుకుంటున్న చర్యలేంటి, సంక్షేమ పథకాల అమలు ఎక్కడ జరుగుతోంది, ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులు ఏమయ్యాయి, దళిత క్రైస్తవ రిజర్వేషన్లు, అంబేద్కర్ రాజ్యాంగ అమలు, అలాగే పారిశ్రామికవేత్తల సబ్సిడీల నిధులు ఎక్కడ ఉన్నాయనే.. ఏడు ప్రధాన అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అందవలసిన ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. దళితుల సమస్యలను కేవలం ఒక వర్గానికి సంబంధించిన సమస్యలుగా చూడకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలుగా పరిగణించాలని, అణగారిన వర్గాల హక్కులను కాలరాస్తూ దళితులను విస్మరిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తీవ్రంగా హెచ్చరించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితులు, గిరిజనులు, బహుజనులు, వెనుకబడిన



వర్గాలను ఐక్యం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మహా గర్జనలో ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మానికొండ శ్రీధర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, జాతీయ క్రమశిక్షణా సంఘం చైర్మన్ కొమ్మూరి గరటయ్య మాదిగ, కోర్ కమిటీ చైర్మన్ గుండాల ఆనంద్ మాదిగ, పెంకి సుధాకర్ మాదిగ, బెల్లంకొండ గోపి మాదిగ తదితరులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్పై గోపిరెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం

- **పేదల వైద్యసాయాన్ని రాజకీయంగా చూడొద్దు**
- **ఇప్పటివరకు 1,400 మందికి రూ.15 కోట్ల సీఎంఆర్ఎఫ్, 200 మందికి రూ.5 కోట్ల ఎల్వోసీలు పంపిణీ**
- **మొత్తం పేదలకు పంచింది రూ.20 కోట్లు అయితే రూ.100 కోట్లు ఎలా సంపాదిస్తారు..?**
- **నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**



నరసరావుపేట, సెప్టెంబర్ 10: (మనం న్యూస్ ప్రతినిధి): మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తనపై చేసిన సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పేదలకు మొత్తం పంచింది రూ.20 కోట్లు అయితే రూ.100 కోట్లు ఎలా సంపాదిస్తారని ప్రశ్నించారు. పేద ప్రజలకు వైద్యపరంగా అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు. సీఎంఆర్ఎఫ్ నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఎమ్మెల్యేకు చేరదని, లబ్ధిదారులైన పేషెంట్ల బ్యాంకు ఖాతాల్లోకే నేరుగా జమ అవుతాయని తెలిపారు. గురువారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు వైద్య సహాయం నిమిత్తం రూ.32,31,745 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో సుమారు 1,400 మందికి రూ.15 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మరో 200 మందికి రూ.5 కోట్ల విలువైన ఎల్వోసీలు అందించినట్లు తెలిపారు. బయటి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించుకున్న పేదలు సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే, వాటిని ఎమ్మెల్యేగా తాను సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేసే బాధ్యత మాత్రమే నిర్వహిస్తున్నానని అరవిందబాబు వివరించారు. ప్రతి దరఖాస్తును ప్రభుత్వం పరిశీలించిన అనంతరం అర్హత మేరకు సహాయం మంజూరు చేస్తుందని, చెక్కుల పంపిణీ కూడా మీడియా సమక్షంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా తాను రూ.100 కోట్లు సంపాదించుకున్నానని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలను అరవిందబాబు తీవ్రంగా ఖండించారు.నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్, ఎల్ ఓ సి ఇప్పటికే పేదలకు మొత్తం పంచింది రూ. 20 కోట్లు మాత్రమేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ విధానం, నిధుల మంజూరు, లబ్ధిదారుల ఖాతాలకు చెల్లింపులు జరిగే విధానాన్ని పరిశీలిస్తే అలాంటి ఆరోపణకు ఆధారం లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులన్నీ సంబంధిత పేషెంట్లకు, వారి ఖాతాల్లోకే వెళ్తాయని స్పష్టం చేశారు.తనపై వచ్చే విమర్శలకు వాస్తవాలతోనే సమాధానం చెబుతానని, పేదల వైద్యసాయానికి సంబంధించిన అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చవద్దని కోరారు.వైసీపీ హయాంలో సీఎంఆర్ఎఫ్పై ప్రశ్నలు లేవనెత్తాను.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధుల విషయంలో పేదలకు తగినంత సహాయం అందలేదని అరవిందబాబు విమర్శించారు.సీఎంఆర్ఎఫ్ పేరుతో సుమారు రూ.300 కోట్ల మేర అక్రమాలు జరిగాయని తాను అప్పట్లో అసెంబ్లీలో ప్రస్తావించానని, ఆ వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరినట్లు చెప్పారు.అలాగే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించిన సుమారు రూ.400 కోట్ల నిధుల వినియోగంపై కూడా అప్పట్లో అసెంబ్లీలో ప్రశ్నలు లేవనెత్తానని తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు.పేదల కోసం డాక్టర్గా,ఎమ్మెల్యేగా పనిచేస్తున్నా, తాను ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా వైద్యుడిగా కూడా పేదలకు అందుబాటులో ఉంటున్నానని అరవిందబాబు అన్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఓపీ రోగులను చూస్తున్నానని, వైద్య సేవలతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నిరంతరం ప్రజల్లో తిరుగుతున్నానని చెప్పారు. ప్రజల ప్రతి సమస్యను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయడమే తన లక్ష్యమన్నారు. తనను ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆదరిస్తున్నారని, అందరి సహకారంతోనే ఎమ్మెల్యేగా విజయం సాధించానని పేర్కొన్నారు. గతంలో రాజకీయంగా తాను వెనుకబడతానని కొందరు వ్యాఖ్యానించినప్పటికీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల మద్దతుతో విజయం సాధించానన్నారు.డీఎస్సీ నియామకాలపై కూడా విమర్శలు సరికాదు కూటమి ప్రభుత్వం చేపడుతున్న డీఎస్సీ నియామకాలపైనా ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను అరవిందబాబు తప్పుబట్టారు. మెరిట్ ఆధారంగా ఎంపికైన వేలాది మంది అభ్యర్థులను అవమానించేలా పేపర్ లీక్, అక్రమ మార్గాల ద్వారా ఉద్యోగాలు పొందారంటూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.వికలాంగులకు, క్రీడాకారులకు రిజర్వేషన్లను అమలు చేస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను అమలు చేస్తోందని అరవిందబాబు తెలిపారు. అన్న క్యాంటీన్లను కూడా పునరుద్ధరించామని చెప్పారు.కరోనా సమయంలో ప్రజలకు, ప్రభుత్వ సిబ్బందికి ఆహారం, నిత్యావసర వస్తువులు అందించేందుకు తాము చేసిన సేవలను గుర్తుచేశారు. రెండు కరోనా దశల్లో సుమారు 46 వేల మందికి నిత్యాన్నదానం, నిత్యావసర వస్తువుల పంపిణీ చేసినట్లు తెలిపారు. 2029లోనూ గెలుపు ఖాయం: అరవిందబాబు.ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందున 2029 ఎన్నికల్లోనూ నరసరావుపేట ప్రజలు తనను మరోసారి ఆశీర్వదిస్తారని అరవిందబాబు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడును మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు నరసరావుపేట ప్రజలు కూటమికి అండగా నిలుస్తారని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని, ప్రజల తీర్పుతో ప్రతిపక్ష విమర్శలకు సమాధానం చెబుతామని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు భయపడేది లేదని,పేద ప్రజలకు అండగా ఉండే తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే అరవిందబాబు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతోపాటు ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కీళ్ళు,ఎముకల సంరక్షణ అందరి వ్యక్తిగత బాధ్యత

**▸▸ లీ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం**

**▸▸ వైద్య శిబిరానికి విశేషమైన స్పందన**

**▸▸ ఆరోగ్య విషయంలో ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించాలి**

**▸▸ లీ పౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి**



**విశాఖపట్నం.సెప్టెంబర్,10,(మనం న్యూస్)ః** ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరు వ్యక్తిగత బాద్యత అవసరమని,ఎముకలు కీళ్ళు సంరక్షకు జాగ్రత్తలు తీసుకోవాలని లీ ఫార్మా ట్రస్టీ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. లీ ఫౌండేషన్, జిల్లా పరిషత్ విశాఖపట్నం సహకారంతో స్థానిక ప్రజల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరం ద్వారా మొత్తం 100 మంది లబ్ధి పొందారు. ఈ శిబిరంలో యాంత్రోపోమెట్రిక్ కొలతలు, నడుము-ఒంటి నిష్పత్తి , హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు (బిపి), బాడీ కంపోజిషన్, ఎముక ఖనిజ సాంద్రత పరీక్షలతో పాటు వైద్యులు, న్యూట్రిషనిస్ట్ మరియు యోగా థెరపిస్ట్ల ద్వారా ఉచిత సలహాలు, సంప్రదింపులు అందించారు. ఈ సందర్భంగా లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ తమ పౌండేషన్ ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టామని,అందులో భాగంగానే ఎముకలు,కీళ్ళ కోసం ఉచిత వైద్య శిబిరాలు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, డాక్టర్ రావు బాబు, న్యూట్రిషనిస్ట్ క్రాంతి, యోగా థెరపిస్ట్ అఖిల్ సూర్య తేజ, లీ టీమ్ సభ్యులతో పాటు జెట్పీ విశాఖ సీఈఓ నారాయణమూర్తి , డిప్యూటీ సీఈఓ రాజ్కుమార్ , జెట్పీ చైర్మన్ జె.సుభద్ర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రత్నకుమార్ , కోఆర్డినేటర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## వర్షపు నీరు రహదారుల పైన నిలవకుండా చర్యలు



**విజయవాడ,సెప్టెంబర్, ,10,(మనం న్యూస్)ః** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం వర్షం కురిసిన నేపథ్యంలో పాలిక్లినిక్ రోడ్డు, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ రోడ్, ప్రాంతాలలో లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా డ్రెయిన్లు, కల్వర్టులు, క్యాచ్పిట్లు తదితరాలను నిరంతరం పరిశీలించి, ఎక్కడైనా అడ్డంకులు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని సూచించారు. నీటి నిల్వ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వర్షం కురిసిన వెంటనే నీటిని తొలగించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.రహదారుల్లో నిలిచిన వర్షపు నీటిని ఎయిర్టెక్ మెషీన్లతో త్వరితగతిన తొలగించి, రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగరంలో వర్షాల సమయంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్లు నిరంతరం అందుబాటులో ఉంటుంరని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ వర్షపు నీటి తొలగింపు, డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కమిషనర్ అన్నారు. ఈ పర్యటనలు జోనల్ కమిషనర్ షమ్మీ, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


## బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీకి జాతీయ సద్భావన ఉత్కృష్టత పురస్కారం



**▸▸ సేవకు సత్కారం..**

**పుణే,సెప్టెంబర్,10,(మనం న్యూస్):** జ్ఞాన మందిర్ నివాస్, పుణేలో నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో జంపాని, తెనాలి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చెందిన బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీ ని యంఐటి వరల్ పీస్ యూనివర్సిటీ, పుణే వ్యవస్థాపకులు రాజయోగి డా. విశ్వనాథ్ డి. కరాడ్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక జాతీయ సద్భావన ఉత్కృష్టత పురస్కార్‌తో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మికత, మానవతా సేవ, సద్భావన, శాంతి, సోదరభావం మరియు సమాజంలో మానవ విలువలను పెంపొందించేందుకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. విశ్వనాథ్ డి. కరాడ్ తన చేతుల మీదుగా 'యు మై బిలివర్ మై నాట్' అనే పుస్తకాన్ని కూడా బాబా నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీ కి అందజేశారు. దీంతో ఈ కార్యక్రమం మరింత ప్రత్యేకంగా, చిరస్మరణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అహిల్యానగర్ జిల్లా, పర్నేర్, పింప్రి-జలసేన్, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సూఫీ సంత్ డా. షాబుద్దీన్ నూర్ మహమ్మద్ పఠాన్ పాల్గొని ఆధ్యాత్మిక ఆశీస్సులు అందించారు.అలాగే ముంబైకి చెందిన కే. గంగాధర్ మరియు దినేష్ పాటిల్ కార్యక్రమంలో పాల్గొని తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు .కార్యక్రమంలో నాగ్పూర్కు చెందిన డా. అనిల్ వాఘ్ ని కూడా జాతీయ సద్భావన ఉత్కృష్టత పురస్కార్ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, శాస్త్రీయ ఆలోచన, మానవతా విలువలు, శాంతి మరియు సద్భావనను ఏకతాటిపైకి తీసుకువచ్చిన విశిష్ట





వేదికగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, నిస్వార్థ సేవ మరియు మానవతా సందేశాన్ని మరింతగా విస్తరించేందుకు స్ఫూర్తినిస్తాయని పాల్గొన్న వారు పేర్కొన్నారు.



## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం..

**ఆసుపత్రికి భారీ జరిమానా**

**సిబ్బందికి అవగాహన కల్పించిన చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. నిర్మల గ్లోరీ**



**విజయవాడ,సెప్టెంబర్,10,(మనం న్యూస్):** నగరంలోని ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాల్సిందేనని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ స్పష్టం చేశారు.సూర్యారావుపేటలోని సతీష్ గ్యాస్ట్రో హాస్పిటల్లో గురువారం సాయంత్రం ఆమె బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేర్వేరుగా సేకరించకుండా అన్ని రకాల వ్యర్థాలను ఒకే చెత్తబుట్టలో వేస్తున్నట్లు గుర్తించారు. అలాగే ఆసుపత్రి సిబ్బందికి బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సరైన అవగాహన లేకపోవడాన్ని గమనించారు. వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడంపై ఆసుపత్రి యాజమాన్యానికి భారీ జరిమానా విధించారు. అదేవిధంగా బయోమెడికల్ వ్యర్థాలను ఎలా వేరు చేసి సేకరించాలి, నిల్వ చేయాలి, సంబంధిత ఏజెన్సీలకు ఎలా అప్పగించాలి అనే అంశాలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల గ్లోరీ మాట్లాడుతూ నగరంలోని అన్ని ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ వ్యర్థాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ కలపరాదని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో వ్యర్థాలను వాటి స్వభావం ఆధారంగా వేర్వేరు కేటగిరీలలో సేకరించి, నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంపై ఉందన్నారు. బయోమెడికల్ వ్యర్థాలను సేకరిస్తున్న సంబంధిత ఏజెన్సీలు కూడా ఆసుపత్రుల్లోని సిబ్బందికి వ్యర్థాల వేరు చేయడం, సేకరణ, నిల్వ మరియు నిర్వహణపై క్రమం తప్పకుండా అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. నగరంలో ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణకు విఘాతం కలిగించే విధంగా వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఆసుపత్రులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ నిర్మల గ్లోరీ హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వల్లభనేని వంశీకి తగిన గుణపాఠం చెబుతాం చలమలశెట్టి రమేష్ బాబు



**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 10 ( మనం న్యూస్ )ః** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు గన్నవరం మాజీ ఎం ఎల్ ఏ వల్లభనేని వంశీ మోహన్ పై మండిపడ్డారు. గురువారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లోని చలమలశెట్టి రమేష్ బాబు నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రం కోసం పవన్ కళ్యాణ్ 2009 నుండి 2014 వరకు రాష్టాభివృద్ధి కోసం ప్రశ్నిస్తూనే ఉన్నారని అన్నారు.అటువంటి పవన్ కళ్యాణ్ ను వంశీ మోహన్ విమర్శించటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లాడశెట్టి నాగేశ్వరరావు,వడ్డి శివ నాగేశ్వరరావు, షేక్ అహమ్మద్, చిమట రవివర్మ, పరుచూరి సుకుని, కొలసాని శివలీల, మద్దా జయరాణి, బండారు లక్ష్మీ ప్రసన్న, పవన్, వడ్డి అశోక్, వడ్డి తరుణ్,భార్గవ్, పూషదపు వీర వెంకయ్య, మహేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# 18లోగా సీలింగ్ భూముల దరఖాస్తులపై అభ్యంతరాలు తెలపాలి



**గుంటూరు, సెప్టెంబర్ 10 : (మనం న్యూస్ ప్రతినిధి)** పట్టణ భూ పరిమితుల చట్టం, 1976 క్రింద ప్రభుత్వ పరిధిలోకి వచ్చిన సీలింగ్ భూములు,మిగులు భూములు క్రమబద్ధీకరణకు 335 మంది దరఖాస్తులు సమర్పించారని జాయింట్ కలెక్టర్ మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధీకృత అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఉంటే ఈ నెల 18వ తేదీ లోగా సమర్పించాలని కోరారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీలింగ్ భూములు,మిగులు భూములు క్రమబద్ధీకరణకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.యం.యస్.నెం.36కు కొన్ని సవరణలు చేస్తూ ఆయా భూములను క్రమబద్ధీకరణ చేసుకొనుటకు జి.ఓ.యం యస్.నెం.84 రెవిన్యూ (భూములు-ఐ) శాఖ, తేది.24.02.2023 ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వివరించారు. తదనుగుణంగా జి.ఓ.యం యస్.నెం. 27 రెవిన్యూ (భూములు-ఐ) శాఖ, తేది. 27.01.2025 ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఈ ఉత్తర్వులు మేరకు సీలింగ్ భూములు క్రమబద్ధీకరణకు దాఖలుచేసిన ఆర్జీలను అర్బన్ ల్యాండ్ సీలింగ్ జిల్లా స్థాయి పరిశీలనా కమిటీ జిల్లా కలెక్టరు మరియు చైర్మన్ నేతృత్వంలో విచారణ చేసి రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమీషనరుకు పంపించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 335 మంది దరఖాస్తులు సమర్పించారని, వాటిని ప్రజల పరిశీలనకు గుంటూరు జిల్లా అధికారిక వెబ్ సైట్ రీరీరీ.జ్ఞుఙు.ౢఇఃజౌరి.జీు లో పొందుపరచడం జరిగిందన్నారు. వీటిపై ఎవరికైనా ఏదేని అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్ మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధీకృత అధికారి కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ లోగా లిఖిత పూర్వకంగా సమర్పించాలని తెలిపారు.

# స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకునే సువర్ణావకాశం



**▶▶ డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్లకు స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు సచివాలయాల్లోనే నేరుగా దరఖాస్తు చేసుకోండి : డీడీ షేక్ షాహిద్ బాబు**

**▶▶ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా'స్వీయ ధృవీకరణ' తో నేరుగా దరఖాస్తు చేసుకోండి.**

**▶▶ మచిలీపట్నం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కీలక ప్రకటన.**

**పామర్రు /మచిలీపట్నం, సెప్టెంబర్ 10(మనం న్యూస్ ):**డప్పు కళాకారులు, చర్మకారులకు మంజూరు చేసే పింఛన్ల దరఖాస్తు ప్రక్రియను ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తుల కోసం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు స్పష్టం చేశారు. నూతన విధానం ప్రకారం ప్రజలు తమకు సమీపంలోని 'స్వర్ణ గ్రామం' లేదా 'స్వర్ణ వార్డు' సచివాలయాల ద్వారానే అత్యంత సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 01.దరఖాస్తుచేసుకునేవిధానం:స్వీయ ధృవీకరణ చాలు: దరఖాస్తుదారులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా, కేవలం తమ 'స్వీయ ధృవీకరణ' పత్రంతో నేరుగా సచివాలయాల్లో దరఖాస్తులను సమర్పించవచ్చు. 2.గ్రామీణ ప్రాంతాల్లో (రూరల్): గ్రామాల్లోని దరఖాస్తుదారుల వివరాలను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కంప్యూటర్లో నమోదు చేసి ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేస్తారు. 3.పట్టణ ప్రాంతాల్లో (అర్బన్): మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులు తమ వార్డు సచివాలయంలోని ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలి.4.పారదర్శక పరిశీలన: ఆన్లైన్లో నమోదైన దరఖాస్తులను సంబంధిత వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్( డబ్ల్యూఈఏ) లేదా వార్డు వెల్ఫేర్ సెక్రటరీ నిబంధనల ప్రకారం పరిశీలిస్తారు.5.క్షేత్రస్థాయి ధృవీకరణ : లబ్ధిదారుల అర్హతను నిర్ధారించేందుకు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసిన అనంతరం, తదుపరి అనుమతుల కోసం సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ కి నివేదికలను పంపుతారు. 6.సందేహాలు ఉంటే వీరినే సంప్రదించండి: పింఛన్ల దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి సందేహాలు లేదా సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా, గ్రామీణ ప్రాంతాల్లోని స్వర్ణ గ్రామ సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ను లేదా పట్టణాల్లోని స్వర్ణ వార్డు వెల్ఫేర్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించి పరిష్కరించుకోవచ్చని షాహిద్ బాబు వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

# నాలుగో రోజుకు చేరుకున్న కోనేరు నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలు




**నందిగామ,సెప్టెంబర్ 9(మనం న్యూస్):** ఈరోజు కోనేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి నాలుగో రోజు నిరాహార దీక్షలకు బీఎస్పీ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలి కూర పుష్పరాజు గారు విచ్చేసి మహిళ భక్తులను దండలు వేసి నిరాహార దీక్షలో కూర్చోబెట్టారు. రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు పుష్కరిణి ఆక్రమణలు తొలగించాలని హిందూ సంఘాల డిమాండ్ చేశారు. నందిగామ పట్టణం లోని శుక శ్యామలంబ సమేత రామలింగేశ్వర స్వామి వారి కోనేరు పుష్కరిణి ఆక్రమణలు తొలగించాలని హిందూ సంఘాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో నాలుగో రోజుకు చేరుకున్నాయి, గురువారం రామలింగేశ్వర స్వామి ఆలయము వద్ద రిలే నిరాహార దీక్షలో దేవరకొండ రమాదేవి, మేకల రోజా, కలంకం తిరుమల జోష్న, షేక్ రజియా బేగం, జుట్టు బోయిన గౌరీ శంకర్ లకు బహుజన సమాజ్వాది పార్టీ ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్ప రాజ్ దీక్షలో పాల్గొన్న మహిళలకు దండ వేసి రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు.. రామలింగేశ్వర స్వామి కోనేరు పుష్కరిణి ఆక్రమణల విషయంలో రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని, హిందూ సంఘాలు కోనేరు పుష్కరిణి ఆర్కామల్ల తొలగించాలని పలుసార్లు ఉద్యమ రూపంలో నిరసనలు చేసి చేపట్టిన అధికారులు చర్యలు తీసుకోకుండా జాప్యం వహించడం బాధాకరమని పుష్పరాజ్ తెలిపారు.. స్వామి వారి కోనేరు పుష్కరిణి ఆక్రమణల తొలగించాలని రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలను ఆయన అభినందించారు.. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలకు కోనేరు పుష్కరిణి కమిటీ సభ్యులు, హిందూ సంఘాల సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు సంఘీభావం తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందాలి



**గుంటూరు, సెప్టెంబర్ 10 : (మనం న్యూస్ ప్రతినిధి)** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందాలని రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన చైర్మన్ప్రత్తిపాడు,తెనాలి నియోజకవర్గాల పరిధిలో పెదనందిపాడు ,ఏటుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, తెనాలి మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలు,ప్రభుత్వ రేషన్ షాపులు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల (బాలికలు), ఎస్సీ,బీసీ,వెల్ఫేర్ హాస్టల్స్ (బాలురు, బాలికలు) లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆహార పదార్థాల నాణ్యత, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించడం వలన చక్కటి ఆరోగ్యంతో విద్యపై దృష్టి సాధించగలరని అన్నారు. విద్యా బోధన పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు పొందే విధంగా ఉపాధ్యాయులు,సిబ్బంది కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన,జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి,జిల్లా గిరిజన సంక్షేమ,సాధికారత అధికారి డి.దుర్గాబాయి ,ఆహార తనిఖీ అధికారులు,కొలతలు తూనికల అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటమ్ క్వెస్ట్ - సమస్యా పరిష్కార సవాలు



**మైలవరం సెప్టెంబర్ 10 మనం న్యూస్ :**స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్) లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, క్వాంటమ్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో క్వాంటమ్ క్వెస్ట్: ప్రాబ్లమ్ సాల్వింగ్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవ (ఇనాగరల్) కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె. అప్పారావు, అకడమిక్ డీన్ ఎం. శ్రీనివాస రావు, రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డీన్ ఎస్. పిచ్చి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, భవిష్యత్ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే విధంగా తమ నైపుణ్యా లను అభివృద్ధి చేసుకోవాలని వారు సూచించారు. ఈ ఛాలెంజ్లో విద్యార్థులు వాస్తవ ప్రపంచానికి సంబంధించిన క్వాంటమ్ కంప్యూటింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తమ తార్కిక ఆలోచనా విధానం, సృజనాత్మకత, కోడింగ్ నైపుణ్యాలు మరియు బృంద సమన్వయాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్గా ఎస్. నాగార్జున రెడ్డి, ప్రొఫెసర్ మరియు హెడ్, సి ఎస్ ఈ విభాగం మరియు కె. దేవి ప్రియ, కె. ఫణీంద్ర, ఎస్. శ్రీనివాస రెడ్డి, పి. సరళ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

# మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఘన సత్కారం

**▶▶ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన నాగేశ్వర రెడ్డి - టీడీపీ నాయకులు**



**మైలవరం సెప్టెంబర్ 10 మనం న్యూస్:** స్థానికంగా జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేం దుకు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వర్యులు ఆనం రామ నారాయణ రెడ్డి ని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తో కలసి ముప్పిడి నాగేశ్వర రెడ్డి, వేణుగోపాల రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్, రామిరెడ్డి, శ్రీను లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారా యణ రెడ్డి కి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, గౌరవాభిమానాలను వ్యక్తం చేశారు. మంత్రి మైలవరానికి విచ్చేసిన సందర్భంగా నాగేశ్వర రెడ్డి తో పాటు పలువురు టీడీపీ నాయకులు మంత్రివర్యు లను మర్యాదపూర్వకంగా కలిసి సాదరంగా స్వాగతం పలికారు.

## ఘనంగా కవి సామ్రాట్ విశ్వనాథ
# సత్యనారాయణ 131 వ జయంతి



**నందిగామ,సెప్టెంబర్ 10(మనం న్యూస్):** నందిగామ శాఖ గ్రంధాలయం నందు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 131 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ సిల్వర్ స్టార్ నందిగామ అధ్యక్షులు పులిపాటి వెంకటేశ్వరావు విచ్చేసి విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, బ్రహ్మం మాస్టారు, గ్రంథాలయ పాఠకులు గోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొని విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికిపుష్పాలు వేసి నివాళులు అర్పించినారు. గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబర్ 10న ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఉంగుటూరు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో జన్మించారని, ఈయన ఎన్నో ప్రసిద్ధ నవలలు, కథలు, కావ్యాలు రచించినారని, ముఖ్యమైనవి వెయ్యి పడగలు నవల, శ్రీమద్రామాయణ కల్పవృక్షం, కిన్నెరసాని పాటలు, ఆంధ్ర పౌరుషం మొదలైనవి ముఖ్యమైనవి, ఈయన రాసిన శ్రీమద్రామాయణ కల్పవృక్షానికి1 970లో కేంద్ర ప్రభుత్వం జ్ఞానపీఠ అవార్డు, లక్ష రూపాయలు నగదు బహుమతిగా ఇచ్చినారు, పద్మ విభూషణ అవార్డును కూడా అందుకున్నారు. ఈయన రచించిన వెయ్యి పడగలను పీవీ నరసింహారావు హిందీలోకి అనువదించినారు, ఈయన 1976 అక్టోబర్ 18న మరణించినారని గ్రంథాలయ అధికారి తెలియజేశారు.

## తెలుగు సాహిత్యానికి కవిసామ్రాట్ విశ్వనాథ
# సత్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయం!!



**కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా ఘన నివాళులు. వీరంకి వీరాస్వామి.**

**నందిగామ,సెప్టెంబర్ 10(మనం న్యూస్):** గురువారం రోజున ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం నందిగామ మండలం కంచల గ్రామంలో తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా కంచల లోఆయన చిత్రపటానికి వీరంకి వీరాస్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరంకి వీరాస్వామి మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కవిత్వం, నవల, నాటకం, సాహిత్య విమర్శ తదితర అనేక ప్రక్రియల్లో ఆయన అద్భుతమైన రచనలు చేసి తెలుగు భాషకు విశిష్టమైన గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. 'వేయి పడగలు', 'రామాయణ కల్పవృక్షము' వంటి మహోన్నత రచనల ద్వారా తెలుగు సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఆయనకు లభించిన జ్ఞానపీఠ పురస్కారం తెలుగు భాషకు దక్కిన గొప్ప గౌరవమని అన్నారు. నేటి యువత విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యాన్ని చదివి, తెలుగు భాషా సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకోవాలని వీరాస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహిత్యాభిమానులు, ప్రజలు పాల్గొని కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాధాకృష్ణమూర్తి, రామిరెడ్డి ఎలమందయ, చనవల రాము మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# దళితుల హక్కుల పరిరక్షణకు పోరాటం



**గాంధీనగర్ సెప్టెంబర్ 10 మనం న్యూస్ :** ఎస్సీ, ఎస్టీల హక్కులు, సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్ ధర్నా చౌక్లో దళిత గర్జన ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి సాలెం రాజు మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, జాతీయ కార్యవర్గ అధ్యక్షులు మానికొండ శ్రీధర్ మాదిగ పాల్గొన్నారు. అమరావతి రాజధానిలో ఎస్సీ, ఎస్టీల పాత్ర, ఉప ప్రణాళిక నిధులు, పారిశ్రామిక రాయితీలు, దళితులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని, హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగబద్ధ పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శులు గోపి మాదిగ, వై.ఎస్. రాజమాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏటుకూరి విజయ్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరత్నం, వివిధ జిల్లాల నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు

# ఆత్మహత్యల నివారణ పై విద్యార్థులకు అవగాహన

**సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు**




**నందిగామ,సెప్టెంబర్ 10(మనం న్యూస్):** నందిగామ మండలం,అనాసాగరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆత్మహత్య నివారణ సదస్సులో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఆత్మహత్యల నివారణ పై విద్యార్థులకు అవగాహన ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం పురస్కరించుకొని . గురువారం నందిగామ పట్టణం అనాసాగరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ సమన్వయంతో విద్యార్థులకు ఆత్మహత్య నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ రమేష్ బాబు, జిల్లా బాలిక శిశువు అభివృద్ధి అధికారిని విశ్వభారతి లు మాట్లాడుతూ సమస్యలు శాశ్వతం కాదని జీవితం ఎంతో విలువైనదని సందేశాన్ని తెలుపుతూ ఒత్తిడి, బావోద్రేకం సమస్యలను గుర్తించి ధైర్యంతో ఎదుర్కోవాలని, మానసిక ఆరోగ్యం, భద్రత పలు అంశాలపై అవగాహన సదస్సులో వివరించారు.. ప్రతి ఒక్కరి జీవితం విలువైనదని. కష్టాలు సమస్యలు తాత్కాలికమైన వని. సరైన వ్యక్తిని సంప్రదించడం ద్వారా అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులకు వివరించారు, ముఖ్యంగా విద్యార్థులు తమ భావాలను మనసులో దాచుకోకుండా విశ్వసనీయమైన తల్లిదండ్రులు ఉపాధ్యాయు లతో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మ. మండల సమగ్ర శిక్ష కొమ్మూరి నరసింహారావు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మొర్సుమిల్లి లో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



**మైలవరం సెప్టెంబర్ 10 మనం న్యూస్ :** ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ డివిజన్, మైలవరం మండలం, మొర్సుమిల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మొర్సుమిల్లి గ్రామంలో రీ - సర్వే ప్రక్రియ లో భాగంగా మొత్తం 1,049 మంది పట్టాదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయబడి నాయి. అందులో భాగంగా ది.10.09.2026న 282 మంది పట్టాదారులకు పట్టాదారు పాసుపుస్తకాల ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. అలాగే కిలారు సత్య నారాయణ, కో - ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు మోతళ్ల వెంకట సుబ్బారావు, చల్లా సుబ్బా రావు, బోయపాటి చిన నరసింహారావు, పాల కేంద్రం అధ్యక్షులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు. రీ - సర్వే ద్వారా భూ రికార్డు లను ఆధునీకరించి, భూములకు సంబంధించిన హక్కులను మరింత పారద ర్శకంగా, సులభంగా అందు బాటులోకి తీసుకురావడం లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## నందిగామలో 64 పోలింగ్ స్టేషన్లతో
# కూడిన ముసాయిదా జాబితా ప్రదర్శన



**పురపాలక సంఘ కమిషనర్ జి. లోవరాజు**

**నందిగామ,సెప్టెంబర్ 10(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి మార్గదర్శకాల మేరకు, నందిగామ పురపాలక సంఘం నందు నూతనంగా విభజించబడిన 32 వార్డులకు సంబంధించి 64 పోలింగ్ స్టేషన్లతో కూడిన ముసాయిదా జాబితాను గురువారం రోజున నందిగామ పురపాలక సంఘ కార్యాలయం నందలి నోటీసు బోర్డులో, అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, 16వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, తపాలా కార్యాలయం మరియు 10 సచివాలయ వార్డు కార్యాలయములందు, సాధారణ ప్రజల సమాచారం కొరకు మరియు సూచనలు/ అభ్యంతరాలు ఆహ్వానించు నిమిత్తం ప్రదర్శించడం అయినది. ఈ విషయములో ఏవైనా సూచనలు/అభ్యంతరాలు ఉన్నయెడల, సంబంధిత విషయాన్ని ది.11.09.2026 తేదీన సాయంత్రం 5.00 గంటల లోపు పురపాలక సంఘ కార్యాలయం నందు రాతపూర్వకంగా సమర్పించవలసినది గా పురపాలక సంఘ కమిషనర్ జి. లోవరాజు తెలియజేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డా. సి. అపర్ణకు ఘన సత్కారం



**▸ అభినందించిన ఉపకులపతి ప్రొఫెసర్ పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్**

విజయవాడ, సెప్టెంబరు 10, (మనం న్యూస్): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం -2026కు ఎంపికైన ప్రభుత్వ వైద్య కళాశాల, గుంటూరుకు చెందిన ప్రొఫెసర్ డా. సి. అపర్ణ, ఎం.డి. (పాథాలజీ) ను డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయ పరిధిలోని వైద్య కళాశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి డా. సి. అపర్ణ కు లభించింది వైద్య విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలు, విద్యా ప్రమాణాల పెంపునకు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఆమెను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేశారు. గురుపూజోత్సవం-2026 సందర్భంగా సెప్టెంబరు 5న అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా డా. సి. అపర్ణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ డా. సి. అపర్ణను అభినందించి, విశ్వవిద్యాలయం తరపున ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారం డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి, దాని అనుబంధ వైద్య కళాశాలలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# నందిగామలో నేడు ప్రత్యేక గ్రీవెన్స్

**▸ నందిగామ నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి**

**▸ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**



విజయవాడ,సెప్టెంబర్ 10(మనం న్యూస్): 'ఒక నెల - ఒక నియోజకవర్గం' - నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 11వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. నందిగామ మధిరరోడ్డులోని ఆర్.ఎస్ గార్డెన్స్ నందు ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ కోరారు.

# అంగన్వాడీల బలోపేతంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం



**▸ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**

జగ్గయ్యపేట సెప్టెంబర్ 10 మనం న్యూస్: అంగన్వాడీల బలోపేతం తోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ్ మాసం-2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. మన అంగన్వాడీ - మన బాధ్యత అనే సందేశంతో సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు మరియు మహిళల్లో పౌష్టికాహారం, ఆరోగ్యం, బాలల వికాసం, సమాజ భాగస్వామ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, గర్భిణీలు, బాలింతలు కూడా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, విద్యా వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆరోగ్యవంతమైన తరం నిర్మాణమే బలమైన ఆంధ్రప్రదేశ్కు పునాది అని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తూ చిన్నారులు, మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యం మరియు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్లను, ఆయాలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందుగుపల్లి ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారులు సత్యవాణి, సరళ డాక్టర్ షైల మరియు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుడు మాన్యం భూములు గాలికి వదిలి ఇనాం భూములపై నిషేధమా?



**▸ శివాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాదిరాజు కేశవరావు**

**▸ జగ్గయ్యపేటలో 4వ రోజు దీక్షలో నోటికి నల్ల రిబ్బన్ల తో మౌన దీక్ష**

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 10 మనం న్యూస్: దేవుడు మాన్యం భూములు ఆక్రమిస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం రైత్వారి పట్టాలు పొంది 50 సంవత్సరాలుగా అనుభవిస్తున్న భూములపై నిషేధం విధించడం ఎక్కడ న్యాయమని జగ్గయ్యపేట పెద్ద శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మాదిరాజు కేశవరావు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూబాధిత సంఘం ఏర్పాటు చేసిన నాలుగో రోజు దీక్ష శిబిరాన్ని పెన్షన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్బాస్ అలీ, కే కోటేశ్వరావు లు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ దేవుడు మాన్యం భూములు ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారిని వదిలేసి చట్టబద్ధమైన హక్కులు పొందిన సర్వీస్ ఇనామ్ దారులను దోషులుగా నిలబెడుతూ వారి భూములపై నిషేధం విధించడం మన ప్రభుత్వాలకే సాధ్యమైందని విమర్శించారు. ఇనాం భూముల పై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ నేతలు అబ్బాస్ అలీ, కోటేశ్వరరావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నేత ఎం వెంకటేశ్వరరావులు, గంటా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏ మాత్రం ఆర్థిక భారం లేకుండా పరిష్కరించే అవకాశం ఉన్న ఇనాం భూ బాధితుల సమస్యను పరిష్కారం చేస్తూ ఆ భూముల్లో లావాదేవీలు జరిగి కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు సమస్యపై దృష్టి సారించాలని వారు కోరారు. నాలుగో రోజు దీక్షలో రంగాపురం నాగేశ్వరరావు, వరగాని సుదాకర్, మేకల గురు ప్రసాద్, కే చంద్ర శేఖర్, పీ.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

**నోటికి నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్ష**

జగ్గయ్యపేట ఇనాం భూబాధితుల రిలే నిరాహార దీక్ష శిబిరంలో బాధితులు నోటికి నల్ల రిబ్బన్ ధరించి వినూత్నంగా మౌనంగా నిరసన తెలిపారు. పదేళ్లుగా తమ భూములను పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని ఎన్నోసార్లు ప్రభుత్వాలకి విన్నవించినా, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని, తమ భూములపై తమకు హక్కు కల్పించే వరకు విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇనాం బాధిత సంఘం ప్రతినిధులు గద్దె సుదీర్, చింతపల్లి ప్రసాద్, యలవర్తి అచ్యుత రామయ్య, కాకరపర్తి వెంకట రమేష్, కే ప్రసాద్, యలవర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కనీస మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలం

**▸ కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ప్రజా సమస్యలపై గడప గడపకు ప్రజా పోరుబాట**

**▸ తన్నీరు నాగేశ్వరరావు**



జగ్గయ్యపేట సెప్టెంబర్ 10 మనం న్యూస్: ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పర్యాయ సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారంటూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని 22వ వార్డు పీర్ల చావిడి వెనుక భాగం, బ్రాహ్మణ బజార్ ప్రాంతాల్లో నిర్వహించిన 'గడప గడపకు ప్రజా పోరుబాట' కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వార్డులో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ప్రజలు ప్రధానంగా తాగునీటి సమస్య, బోర్ల మరమ్మతులు చేయకపోవడం, వీధిదీపాల సమస్య, పారిశుద్ధ్య సమస్యలపై తమ ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా బోర్ల పనిచేయక సుమారు నాలుగు నెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం వైఎస్ఆర్ సీపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. వార్డుల్లో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను వివరించి, వాటి పరిష్కారం కోసం పోరాడాలని కోరగా, ప్రజా సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పటాన్ ఫిరోజ్ ఖాన్, జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, మాజీ కౌన్సిలర్ నీలం నరసింహారావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ

మైలవరం సెప్టెంబర్ 10 మనం న్యూస్ : స్థానిక మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ 2026 , ఇప్పటివరకు 1,352 దరఖాస్తులు సమర్పించి యున్నారు. వీటిలో 1,085 దరఖాస్తులకు ఆన్లైన్ ప్రక్రియ పూర్తి అయినది. మండలంలోని అన్ని స్వర్ణ గ్రామాల్లో అన్ని పెన్షన్ విభాగాలకు సంబంధించి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు లు స్వీకరించబడుతున్నా యి. అర్హత కలిగిన ప్రజలు సంబంధిత స్వర్ణ గ్రామంలో 16-09-2026 లోపు తమ దరఖాస్తులను సమర్పించు కోవాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నిర్దేశించి న నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుంది. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అర్హత ఉన్నవారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి.

# ‘ఎల్ నినో’ ప్రభావం పొంచి ఉంది..

**పరిసరాల పరిశుభ్రత పారిశుద్ధ్య కార్మికుల భీమా రెవిన్యూల్ పై దృష్టి సారించండి**

**ఉయ్యూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని స్వర్ణలత**

**పారిశుధ్య కార్మికుల బీమాను వెంటనే క్లెయిమ్/రిన్యూవల్ చేయాలి.**

**రాష్ట్ర జిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా,గ్రామాల్లోని చెరువులన్నీ నీటితో నింపాల్సిందే!పరిసరాల పరిశుభ్రత – ప్రజారోగ్య భద్రతపై రాజీ పడేదే లేదు: స్వర్ణలత హెచ్చరిక.**

ఉయ్యూరు, సెప్టెంబర్ 10(మనం న్యూస్ ):గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా మరియు ఉపాధి హామీ పనులలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉయ్యూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి ( డి డి ఓ ) టి.స్వర్ణలత స్పష్టం చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని మండల అభివృద్ధి అధికారులు,పంచాయతీ విస్తరణ అధికారులు కార్యదర్శులు, తో ఆమె ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ మరియు గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్ష జరిపిన ఆమె, డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు క్షేత్రస్థాయి కార్యదర్శులకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు.

### కార్మికుల బీమా పునరుద్ధరణ :

గ్రామాల స్వచ్ఛత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల (గ్రీన్ అంబాసిడర్ల) రక్షణ మనకు ముఖ్యం. కార్మికులకు సంబంధించిన ప్రమాద మరియు ఆరోగ్య బీమా గడువు ముగిసిన వాటిని వెంటనే గుర్తించి, యుద్ధప్రాతిపదికన రిన్యూవల్ చేయించాల్సిన పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఆదేశించారు.

### ముందస్తు తాగునీటి ప్రణాళిక :

రాబోయే కాలంలో ‘ఎల్ నినో’ వాతావరణ ప్రభావం వల్ల తీవ్రమైన ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందని, దీనివల్ల ప్రజలకు నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని రక్షిత తాగునీటి బావులను, అన్ని సాగునీటి మరియు తాగునీటి చెరువులను ముందస్తుగానే పూర్తిగా నీటితో నింపేలా తక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు.

### ప్రజారోగ్య భద్రత – పారిశుధ్యం :

పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని, అది ప్రజల ఆరోగ్య భద్రతకు దోహదపడేలా ఉండాలన్నారు. డ్రైనేజీల క్లీనింగ్, బ్లీచింగ్ చల్లడం నిరంతరం కొనసాగాలని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు నిత్యం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పై పూర్తి పురోగతి సాధించాలని సూచించారు. ఉపాధి హామీ పనుల వేగవంతం (ఆఎఖఅఓ గౌటజుటకౌజ్టౌటజ్ఞజ): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఆఎ ఖఅక) కింద గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కూలీలకు కల్పించే పనుల రికార్డులను, ఆన్లైన్ మస్టర్లను డిజిటల్ అసిస్టెంట్లు మరియు కార్యదర్శులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తేల్చి చెప్పారు. విధుల్లో జవాబుదారీతనం లోపిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని, నివేదికల్లో వాస్తవాలను మాత్రమే పొందుపరచాలని కార్యదర్శులను డీడీఓ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు (పిఒపిఆర్డి )లు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామస్థాయిలో మహిళలు, బాలబాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి



- **సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలి**
- **ఎం ఎస్ కె సిబ్బంది పోలీసులకు–ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలి**
- **సీఐ కె. కిషోర్ బాబు కొత్తూరి**

మైలవరం సెప్టెంబర్ 10 మనం న్యూస్: స్థానిక సర్కిల్ కార్యాలయం లో సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. కిషోర్ బాబు కొత్తూరి ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో (ఎం ఎస్ కె స్) ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వ హించారు. మైలవరం, జి. కొండూరు, రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని మెసేజ్ కె సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ కె. కిషోర్ బాబు మాట్లాడుతూ, మహిళలు, బాలబాలికల భద్రత, బాల్య వివాహాల నివారణ, మైనర్ బాలికలపై వేధింపులు, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత వంటి అంశాల పై గ్రామస్థాయిలో నిరంత రం అవగాహన కల్పించాల ని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలతో అమా యక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్న నేపథ్యంలో డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ యాప్స్, ఆన్లైన్ పెట్టుబడి/టాస్క్ మోసాలు, ఓటీపీ - బ్యాంకింగ్ మోసాలు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన పెంచాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదా ల నివారణకు హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్, ఓవర్లోడింగ్ నివారణ వంటి అంశాలను గ్రామాల్లో ప్రజలకు వివరిం చాలని సూచించారు. పోలీసులతో నిరంతర సమాచార మార్పిడి గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, మహిళలు లేదా బాలబాలికలపై వేధింపులు, మాదకద్రవ్యాల వినియోగం / రవాణా, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు ఏవైనా దృష్టికి వస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ లేదా సర్కిల్ ఇన్స్పెక్టర్ దృష్టికి తీసుకు రావాలని సీఐ సూచిం చారు. ఎం ఎస్ కె సిబ్బంది తమ గ్రామాల్లో ప్రజలతో నిరంతరం మమేకమై, సమస్యలను ముందుగానే గుర్తించి పోలీసులకు సమాచారం అందిస్తూ, పోలీసులకు - ప్రజలకు మధ్య సమన్వయ వారధిగా పనిచేయాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రజలకు చేరు వయ్యే విధంగా నిర్వహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కె. సుధాకర్, జి. కొండూరు ఎస్ఐ కె. సతీష్ కుమార్, స్థానిక ఎస్ఐ - 2 గిరి సాయి, మహిళా ఎస్ఐ గిరిజామణి మరియు సర్కిల్ పరిధిలోని ఎమ్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చతుర్థి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి



గుంటూరు, సెప్టెంబర్ 10: (మనం న్యూస్ ప్రతినిధి)៖ నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్,జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ. వినాయక చతుర్థి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు వినాయక చతుర్థి పండుగ నిర్వహణ,విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై కలెక్టరేట్లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ తో కలసి నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 3 వేలకు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండపాల వద్ద భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్,రెవెన్యూ,మున్సిపల్, ఇరిగేషన్,మత్స్య,విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు.నిమజ్జనం కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు.జిల్లాలో గుర్తించిన 8 ముఖ్యమైన నిమజ్జన కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు.నిమజ్జనం సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున,ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నిమజ్జనం జరిగే చెరువుల్లో తగినంత నీటి నిల్వలు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలను పటిష్టం చేయాలన్నారు.బోట్లలో ఇద్దరు స్విమ్మర్లు తప్పనిసరి.నిమజ్జన కేంద్రాల వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన సంఖ్యలో బోట్లు ఏర్పాటు చేయాలని,ప్రతి బోటులో ఇద్దరు శిక్షణ పొందిన స్విమ్మర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలకు అనుమతి లేదు.గణేష్ మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై ఉన్న నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగం నిషేధమని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించకుండా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు, విద్యార్థులకు,వృద్ధులకు, అనారోగ్యంతో ఉన్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో,బాధ్యతాయుతంగా జరుపుకోవాలని గణేష్ మండపాల నిర్వాహకులకు జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.మట్టి విగ్రహాలనే వినియోగించాలి.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర కాలుష్యానికి కారణమయ్యే పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయం,జేకేసీ కళాశాల రోడ్డు, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని కోరారు. వినాయక చతుర్థి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా గణేష్ ఉత్సవ సమితులు,మండపాల నిర్వాహకులు,స్వచ్ఛంద సంస్థలు,ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారుచేసిన పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకుందామనే వాల్ పోస్టర్ ను అధికారులు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి,జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె.ఖాజావలి,కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నజీనా బేగం,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మి,ఎస్ బి డి ఎస్ పి అళహరి శ్రీనివాసరావు,ఇతరులు పాల్గొన్నారు.

# ఆరియా క్యాన్సర్ సెంటర్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపుకు విశేష స్పందన



గుంటూరు సెప్టెంబర్ :10 (మనం న్యూస్ ప్రతినిధి )గుంటూరు నగరంలోని లలిత పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నూతన ప్రాంగణంలో ఆరియా క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నెలవారీ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. రాఘవశర్మ, డైరెక్టర్ డాక్టర్ పి. విజయ నాయకత్వంలో నిర్వహించిన ఈ క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ప్రపంచ ప్రతిష్టాత్మకమైన లండన్ లోని క్రిస్టీ కాన్సర్ హాస్పిటల్ లో ట్రైనింగ్ పొంది ప్రస్తుతం లలిత హాస్పిటల్ లోని ఆర్య కాన్సర్ సెంటర్ విభాగానికి డైరెక్టర్ మరియు చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ అయిన డాక్టర్ బి. స్రవంతి ఈ క్యాంపును నిర్వహించారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస అయ్యప్ప ,మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కావ్య పామిడి పాల్గొన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష లావు మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించగా,రేడియాలజిస్ట్ డాక్టర్ హనుమాన్ అవసరమైన ఇమేజింగ్ పరీక్షలను నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి. స్రవంతి మాట్లాడుతూ, క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది వ్యాధి లక్షణాలు లేని సమయంలో ముందస్తుగా క్యాన్సర్ను గుర్తించేందుకు చేసే పరీక్ష. లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్ను గుర్తిస్తే చాలా సందర్భాల్లో పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుంది. ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించడం ఎంతో సంతోషంగా ఉంది.ప్రతి కుటుంబం క్రమం తప్పకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ను తమ ఆరోగ్య సంరక్షణలో భాగంగా చేసుకోవాలి అని అన్నారు.క్యాన్సర్ స్క్రీనింగ్ ఎవరు ఉపయోగించుకోవాలి అన్న విషయంపై అవగాహన కల్పిస్తూ డాక్టర్ స్రవంతి పలు సూచనలు చేశారు.30 సంవత్సరాలు పైబడిన మహిళలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్ను ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు.40 సంవత్సరాలు పైబడిన మహిళలు ప్రతి సంవత్సరం మమ్మోగ్రామ్ చేయించుకోవడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ను ముందుగానే గుర్తించవచ్చన్నారు. బ్రెస్ట్ లేదా ఓవేరియన్ క్యాన్సర్ల కుటుంబ చరిత్ర ఉన్న మహిళలు వైద్యుల సూచన మేరకు పెల్విక్ అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.50 సంవత్సరాలు పైబడిన పురుషులు ప్రోస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం (పి ఎస్ ఏ) రక్త పరీక్ష అవసరమా అనే విషయాన్ని వైద్యులను సంప్రదించి నిర్ణయించుకోవాలని తెలిపారు.అలాగే 45 సంవత్సరాలు పైబడిన పెద్దలు ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి కొలొనోస్కోపీ చేయించుకోవడం ద్వారా పెద్దపేగు క్యాన్సర్ను ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు.పొగత్రాగే వారు, పొగాకు నమిలే వారు ప్రతి సంవత్సరం నోరు మరియు మెడకు సంబంధించిన వైద్య పరీక్ష చేయించుకోవాలని సూచించారు.50 సంవత్సరాలు పైబడిన, అధికంగా ధూమపానం చేసే వారికి ప్రతి సంవత్సరం.లోడోస్, సిటీ, చెస్ట్, ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు.ఈ శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా సాధారణ రక్త పరీక్షలతో పాటు మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, పాప్ స్మియర్, పెల్విక్ అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. తదుపరి అవసరమైన,సిటి, ఎమ్మార్ఐ ,హోల్ బాడీ స్కాన్,వంటి వైద్య పరీక్షలను అవసరమైన వారికి 50 శాతం రాయితీతో అందించే సౌకర్యాన్ని కల్పించారు.ఈ క్యాంపునందు 100 మందికి పైగా స్త్రీ పురుషులకు కాన్సర్ స్క్రీనింగ్ మరియు పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపు నందు లలిత హాస్పిటల్ డాక్టర్స్ తో పాటుగా నర్సింగ్ సిబ్బంది,పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు ప్రతి నెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతుంది. ఆరియా క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ సంవత్సరం పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తదుపరి క్యాంప్ గురువారం, 8 అక్టోబర్ 2026 ఉంటుందని డాక్టర్ బి. స్రవంతి తెలిపారు.

# శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపుఆదాయం రూ, 8. 43 లక్షలు




పామర్రు, సెప్టెంబర్ 10( మనం న్యూస్ ): కృష్ణాజిల్లాలో ప్రసిద్ధి చెందిన హనుమత్ దేవాలయాల్లో ఒకటైన పామర్రు మండలం ఉండ్రపూడి --పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ దేవస్థానం హుండి లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. గుడివాడ దేవదాయ శాఖ తనిఖీ అధికారి వి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన 100 రోజుల హుండీ లెక్కింపు లో ఆదాయం రూ 8.43 లక్షల 673 తో పాటు 56 అమెరికన్ డాలర్లు వచ్చినట్లు ఆలయ అధికారి ఎస్ వి ఎస్ ఎస్ ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన ముత్యాలమ్మ అమ్మవారు



జగ్గయ్యపేటసెప్టెంబర్ 10 మనం న్యూస్: జగ్గయ్యపేట శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి వీధిలో వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు శ్రావణ మాస 5 వ ఆఖరి గురువారం సందర్భంగాశ్రీ రాజరాజేశ్వరి దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం ఆఖరి గురువారాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఆలయంలో చండీ సప్తపది హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ హోమం పీటల మీద కూర్చునదలచిన వారు కమిటీ వారిని సంప్రదించాలని కోరారు. దేవస్థాన కమిటీ గౌరవ సలహాదారులు యర్రా శ్రీనివాసరావు ప్రెసిడెంట్ అప్పన మణికుమార్ వైస్ ప్రెసిడెంట్ నోముల శివకుమార్ సెక్రటరీ కొత్త రమేష్ కుమార్ జాయింట్ సెక్రటరీ కొంకిమళ్ల సురేష్ ట్రెజరర్ అప్పన వెంకట పిచ్చయ్య మరియు కమిటీ సభ్యులు చేడే వెంకట శ్రీరంగం, దేవరశెట్టి నాగ ప్రసాద్, తునికి పాటి నాగ మల్లేశ్వరా చారి ఆరేపల్లి వెంకటేశ్వర్లు ప్రత్యేకఏర్పాట్లను చేశారు. అమ్మవారి అలంకరణ దేవస్థానం కుమ్మరి శాలివాహన వంశస్తుల చే నిర్వహించారు.

# చిట్యాల ఐలమ్మ ధైర్యం, తెగువ భావితరాలకు స్ఫూర్తి



**– ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 10 (మనం న్యూస్ ప్రతినిధి) వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.చిట్యాల ఐలమ్మ ధైర్యం, తెగువ భావితరాలకు స్ఫూర్తి అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం వీరవనిత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) 41వ వర్ధంతి సందర్భంగా గుంటూరు రింగ్ రోడ్ చంద్రమౌళినగర్ లోని ఆమె విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే టీడీపీ పొలిట్బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. చిట్యాల ఐలమ్మ కేవలం ఒక సామాజిక వర్గానికే కాదు,యావత్ సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత మహిళ అని కొనియాడారు. ఒక జాతికి గుర్తింపు,గౌరవం తీసుకురావాలంటే కొందరి త్యాగాలు,పోరాటాలు కారణమవుతాయని, అలాంటి త్యాగమూర్తుల్లో చిట్యాల ఐలమ్మ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సామాజిక వివక్ష,అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడిన ధైర్యసాహసాలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఎవరికి భయపడకుండా పోరాడిన సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అని,నా భూమి - నా హక్కు అనే సంకల్పంతో అన్యాయాన్ని ఎదిరించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ఎమ్మెల్యే తెలిపారు. మహిళ అయినప్పటికీ ఆమె చూపిన తెగువ,నిజాన్ని నిర్భయంగా నిలదీసే తత్వం, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు.ఇలాంటి మహనీయులను కేవలం ఒక వర్గానికి పరిమితం చేయకుండా సమాజానికి అంకితం చేయాల్సిన అవసరం ఉందని, భావితరాలు వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందేలా చేయాలని గళ్ళా మాధవి సూచించారు.నేటి యువత చిన్న చిన్న సమస్యలకు నిరాశకు గురికాకుండా చిట్యాల ఐలమ్మలాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సమాజంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చిట్యాల ఐలమ్మ సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్లు,మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు,కుల సంఘాల నాయకులు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 12న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు, సెప్టెంబర్ 10 : (మనం న్యూస్ ప్రతినిధి) జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ పై గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జాతీయ లోక్ అదాలత్ పోస్టర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.లోక్ అదాలత్ సేవలను పొందుటకు కోర్టు ఫీజు లేదని, పరస్పర అంగీకారంతో పరిష్కారం అవుతుందని,త్వరితగతిన న్యాయం లభిస్తుందని చెప్పారు.అన్ని కోర్టుల పరిధిలో జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి,తదితరులు పాల్గొన్నారు.



# ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు కొనసాగిద్దాం

**▸▸ సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి**

**గుంటూరు సెప్టెంబరు 10 (మనంప్రతినిధి):**తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ తన జీవితాంతం పోరాడారని అన్నారు .తెలంగాణ సాయుధ పోరాటానికి ఐలమ్మ పోరాటం గొప్ప స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు.అప్పటి భూస్వామ్య, జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా తిరుగుబాటు జెండా ఎగురవేసిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు.తనకు ఉన్న ఎనిమిది ఎకరాల భూమిలో పండించిన పంటను దోచుకునేందుకు వచ్చిన భూస్వాముల అనుచరులను ఐలమ్మ ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం కారణంగా ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర నిర్బంధానికి గురైనప్పటికీ, ఏమాత్రం వెనక్కి తగ్గకుండా న్యాయపోరాటం కూడా కొనసాగించి విజయం సాధించారని మాల్యాద్రి వివరించారు. అణగారిన వర్గాలు,పేదలు,మహిళల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు నేటికీ పేదలు, రైతులు, కార్మికులు,మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి హక్కుల సాధన కోసం ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అరుణ్ కుమార్ అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న,జి సురేష్ బాబు,పరిమళ బన్నీ, బి.వెంకటేశ్వర్ రెడ్డి,రావుల అంజిబాబు, ఆకిటి రామచంద్రుడు , జగన్నాథం, వేగయ్య,ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి శశి,అమర్, గణేష్ తదితరులు పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.



# కాకుమానులో మెగా వైద్య శిబిరం ప్రారంభం



**గుంటూరు సెప్టెంబర్ :10 (మనం న్యూస్ ప్రతినిధి )**ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్,ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ మరియు కాటూరి మెడికల్ కళాశాల వారి సౌజన్యంతో కాకుమాను మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరంను ఘనంగా ప్రారంభించిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు. పి4 పథకంలో భాగంగా కారుమంచి ప్రసాద్, రూ.1 కోటి వ్యయంతో అందించిన 2 ప్రొక్లేయన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా పత్తిపాడు ఎమ్మెల్యే మాట్లాడుతూ .సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని తెలిపిన మహానేత నందమూరి తారక రామారావు ఆశయ స్ఫూర్తితో,ప్రజా ఆరోగ్యం,ప్రజా సంక్షేమం,ప్రజా సేవ అనే మూడు లక్ష్యాలతో కొనసాగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తూ ముందుకు కొనసాగుతుందని,ఈ కార్యక్రమానికి మూల కారణమైన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ ని, మెగా వైద్య శిబిరం ప్రత్యేకంగా క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులపై ముందస్తు అవగాహన, సకాలంలో వైద్య పరీక్షలు ఎంతో కీలకమని ఎమ్మెల్యే తెలిపారు.ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కాకుమాను మండలంలో పి 4 పథకంలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు తోడ్పడుతున్నారని,ఇలాంటి వ్యక్తులు మన నియోజకవర్గంలో ఉండటం మన అదృష్టమని, గురువారం కోటి రూపాయల వ్యయంతో 2 ప్రొక్లియన్లను అందించిన కారుమంచి ప్రసాద్, కి హృదయపూర్వక అభినందనలు ఎమ్మెల్యే తెలిపారు.వారి సేవలు ఎందరికో ఆదర్శనీయమని ఎమ్మెల్యే తెలిపారు.ఈ మెగా వైద్య శిబిరం నిర్వహణకు సహకరిస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి,కాటూరి మెడికల్ కళాశాల యాజమాన్యానికి, వైద్యులకు మరియు సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉచిత వైద్య సేవలను కాకుమాను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు, వైద్య సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు శరవేగం

**▸▸ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు**



**గుంటూరు పత్తిపాడు సెప్టెంబర్ :10 (మనం న్యూస్ ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా రెపరెపలాడుతుంది ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై,ఎన్నో సంవత్సరాలుగా వదిలివేయబడిన ప్రత్తిపాడు నుండి నిమ్మగడ్డవారిపాలెం సబ్స్టేషన్ వరకు గల సిసి రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన మరియు రూ.7 లక్షల వ్యయంతో నిమ్మగడ్డవారిపాలెంలోని అంతర్గత సిసి రోడ్డును ప్రారంభించిన ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.గత ప్రభుత్వ కాలంలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయడంతో ఈ రహదారి సమస్య సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోలేదు.ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ రహదారి అధ్వాన్న స్థితిలో ఉండటంతో స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు.గత వైసిపి ప్రభుత్వం ఈ రహదారి వైపు కన్నెత్తి చూడలేదని, ప్రజల కనీస అవసరాలపై కూడా శ్రద్ధ చూపలేదని ఈ సందర్భంగా పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నంతకాలం అభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన గత పాలనకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజా అవసరాలనే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని పనులను ముందుకు తీసుకెళ్తోంది.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, నాయకత్వంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేది మేమే,పని పూర్తి చేసి ప్రారంభించేది కూడా మేమే అని ఎమ్మెల్యే, పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# 48 గంటలలో పెట్రోల్ బంకు ఉద్యోగి మృతి చెందిన కేసు చేదించిన కంచికచర్ల పోలీసులు.

**కంచికచర్ల, సెప్టెంబర్ 10(మనం న్యూస్):** నందిగామ రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిటాల శివారు దొనబండ వద్ద ఉన్న హెచ్ పీ పెట్రోల్ బంకు లో ఈనెల 8వ తేదీ తెల్లవారుజాము 4 గంటలకు తప్పుడు నెంబరు ప్లేట్ల కలిగిన కారులో వచ్చి బంకులో పనిచేసే సయ్యద్ ఆరిఫ్ అనే ఉద్యోగిని కొంత నగదు కావాలని,ఇచ్చిన డబ్బులకి అదనంగా పేమెంట్ చేస్తామని తెలపటంతో ఆరిఫ్ డబ్బులు లెక్క వేసే క్రమంలో డబ్బులు లాక్కొని ఒక్కసారిగా కారు వేగంగా లాగించారు. కారు వెంబడి ఆరిఫ్ 150 మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లి ఒక్కసారిగా రోడ్డుపై వెనకవైపు తలకు బలమైన గాయం కావడంతో వెంటనే విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. అదే రోజు రాత్రి అరిఫ్ మృతి చెందడం జరిగింది .ఈ ఘటనను అత్యంతతీవ్రంగా పరిగణించిన విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు నిందితులను వెంటనే అదుపులో తీసుకోవాలని ఆదేశించడంతో రూరల్ డిసిపి బి లక్ష్మీనారాయణ సూచనల మేరకు ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో నందిగామ రూరల్ సీఐ వైవిఎల్ నాయుడు కంచికచర్ల వీరులపాడు పోలీస్ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో రహదారి వెంబడి ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజిలను టెక్నాలజీ బృందాల సహాయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగిందని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితులు గుంటూరు జిల్లాలకు చెందిన వారిని తెలిపారు. గుజ్జర్లపూడి మహేష్ 18 సం సత్తెనపల్లి, చుండి మనోజ్ కుమార్ 18 సం నరసరావుపేట, కామసాని ఆదిత్య 23 సం నరసరావుపేట, కూచిపూడి అరవింద్ 18 సం నరసరావుపేట, మంద రోహిత్ 18 సం నరసరావుపేట టౌన్, సత్తెనపల్లికి చెందిన ఒక మైనర్ నీ అదుపులోకి తీసుకోవడం జరిగిందని మరో నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని వివరించారు. అదనంగా డబ్బులు ఇస్తాము అనే ఆశ చూపి మోసం చేసేవారి పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని, అలాగే యువత తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించి వారు ఎక్కడికి వెళ్తున్నారు ఏమి చేస్తున్నారు అనే విషయాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఈ కేసును చాకచక్యంగా చేదించిన కంచికచర్ల ఎస్సైలు విశ్వనాథ్, నాని నరేంద్ర వీరులు పాడు ఎస్సై అభిమన్యు వారి సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందించారు.




# వివిఐటియూలో 'ప్రింటెడ్ ఎలక్ట్రానిక్స్' పై సదస్సు



**గుంటూరు నంబూరు సెప్టెంబర్ :10 (మనంప్రతినిధి)ః** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నందు ఇంటర్నేషనల్ రిలేషన్స్,టీచింగ్ అండ్ లెర్నింగ్ సెంటర్స్ ఆధ్వర్యంలో ప్రింటెడ్ ఎలక్ట్రానిక్స్ మరియు జర్మనీలో ఉన్నత విద్య,కెరీర్ అవకాశాల పై సదస్సు నిర్వహించినట్లు వివిఐటియూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా జర్మనీకి చెందిన 'బాష్ సెన్సార్టెక్ జీఎంబిహెచ్'సంస్థ సెన్సార్ నిపుణుడు డ్కా సూర్య అభిషేక్ సింగరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా డా.సూర్య అభిషేక్ సింగరాజు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు భాషా ప్రావీణ్యాన్ని కూడా పెంచుకుంటే అంతర్జాతీయంగా మంచి కెరీర్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రింటెడ్ ఎలక్ట్రానిక్స్ అనేది ఎలక్ట్రానిక్స్ రంగాన్ని వేగంగా మారుస్తున్న నూతన సాంకేతికత అని అన్నారు. కాగితం,ప్లాస్టిక్,దుస్తులపై కండక్టివ్ ఇంక్ల సహాయంతో ఎలక్ట్రానిక్ సర్క్యూట్లను ప్రింట్ చేయడం ద్వారా అనేక వినూత్న ఉపయోగాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. అనంతరం డా.సూర్య అభిషేక్ సింగరాజును (వి వి ఐ టి యూ) ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డా. వై. మల్లికార్జున రెడ్డి,టీచింగ్ లెర్నింగ్ సెంటర్ హెడ్ డా.రావెల నవీన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ డా పి. సుజని,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.